

త్వరలో జీవాలకు..

రెండేళ్ల క్రితం నిలిచిపోయిన జీవాలకు నట్టల నివారణ మందుల పంపిణీ త్వరలో ప్రారంభం కాబోతోంది.

- 8లో ▸



కామన్ స్కూల్ విద్యా..

విద్యా వ్యవస్థలన్నీ ఒకే విద్యావిధానాన్ని పాటించాలని పీఆర్‌టీయూ సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్సీ శ్రీపాల్‌రెడ్డి అన్నారు.

- 8లో ▸

గరిష్టం/కనిష్టం
35.0 /22.9

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. వాతావరణంలో తేమ అధికంగా ఉంటుంది. అక్కడక్కడ జల్లులు కురిసే అవకాశాలు ఉన్నాయి.

న్యూస్‌రీల్

మహిళల ఆరోగ్య సంరక్షణే లక్ష్యం



నిజామాబాద్‌నాగారం: మహిళలు, పిల్లల ఆరోగ్య సంరక్షణే తమ లక్ష్యమని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణగుప్తా అన్నారు. స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్‌ను ప్రధానమంత్రి నరేంద్రమోదీ బుధవారం వర్చువల్‌గా ప్రారంభించగా, కలెక్టరేట్ నుంచి బుధవారం ఎమ్మెల్యే వీక్షించారు. అనంతరం దుబ్బ అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్‌లో జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారులతో కలిసి స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ మెగా ఆరోగ్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అక్టోబర్ 2వ తేదీ వరకు కొనసాగుతుందని, జిల్లా వ్యాప్తంగా దాదాపు 40 కేంద్రాల్లో వైద్యారోగ్య అధికారులు మహిళలకు సేవలందిస్తారన్నారు. కరోలిన్ చింగ్తియాన్ మావీకి ఎమ్మెల్యే స్వస్థ్ నారీ సశక్త్ సర్టిఫికెట్‌ను అందజేశారు. డీఎంహెచ్‌వో రాజశ్రీ, జీజీహెచ్ సూపరింటెండెంట్ శ్రీనివాస్, డిప్యూటీ డీఎంహెచ్‌వో అంజన, డాక్టర్ శ్రీనివాస్ ప్రసాద్, వైద్యురాలు సుశానా, తాజా మాజీ కార్పొరేటర్ పంచరెడ్డి ప్రవళిక, శ్రీధర్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కమీషన్‌లను ప్రోత్సహించొద్దు

సాక్షి ఎఫెక్ట్..

నిజామాబాద్‌నాగారం: రోగులను రిఫర్ చేసే ఆర్‌ఎంపీ, పీఎంపీలకు కొన్ని ప్రైవేట్ ఆస్పత్రులు కమీషన్‌లు ఇస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని డీఎంహెచ్‌వో రాజశ్రీ హెచ్చరించారు. స్కానింగ్, ఆస్పత్రుల్లో రిఫరల్ దందాలపై ఇటీవల 'సాక్షి'లో కథనాలు ప్రచురితం కావడంతో డీఎంహెచ్‌వో బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. కమీషన్‌లను ప్రోత్సహించే ఆస్పత్రుల యాజమాన్యాలతోపాటు ప్రాక్టిషనర్లపై చర్యలుంటాయని హెచ్చరించారు. కమీషన్ దందాపై ఆధారాలతో సహా తమ దృష్టికి తీసుకురావాలని, ఫిర్యాదు చేసిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని అన్నారు. ఈ మేరకు ఓ నిఘా బృందాన్ని సైతం నియమించినట్లు తెలిపారు.

లింగాపూర్ మత్స్య సొసైటీ రద్దుకు నోటీసు

డొంకేశ్వర్(ఆర్మూర్): కోటగిరి మండలం లింగాపూర్ మత్స్య పారిశ్రామిక సహకార సంఘం రద్దుకు జిల్లా మత్స్య శాఖ అధికారి నోటీసు జారీ చేశారు. సొసైటీలో 40 మంది సభ్యులు ఉండగా అందరూ ఇతర కులస్తులకు చెందిన వారు ఉన్నట్లుగా గుర్తించారు. నిబంధనలకు విరుద్ధంగా కొనసాగుతున్న సొసైటీకి నోటీసు జారీ చేశారు.

రాచరిక వ్యవస్థ నుంచి ప్రజాస్వామ్య వ్యవస్థలోకి వచ్చిన తెలంగాణ.. ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో గాంధీజీ కలలుకన్న గ్రామస్వరాజ్యం దిశగా వెళ్తోంది. అంతర్జాతీయ పెట్టుబడులకు స్వర్గధామంగా గుర్తింపు పొందింది. రాష్ట్ర వ్యవసాయ చరిత్రను తిరగ రాసి అన్నదాత సంక్షేమానికి రూ.1.13లక్షల కోట్లు ఖర్చు చేశాం. రాష్ట్ర ప్రభుత్వం ప్రజాసమస్యల పరిష్కారంలో ముందుంది. హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తోంది.

– ప్రజాపాలన ఉత్సవాల్లో సీఎం రేవంత్ సలహాదారు వేం నరేందర్‌రెడ్డి



జాతీయ జెండాకు వందనం చేస్తున్న వేం నరేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే భూపతిరెడ్డి, కలెక్టర్, సీపీ తదితరులు

అన్నివర్గాలకు అభివృద్ధి, సంక్షేమ ఫలాలు

- ప్రజాస్వామ్యబద్ధంగా ప్రజాపాలన
- కీలక సంస్కరణగా నిలిచిన భూభారతి చట్టం
- ధాన్యం బోనస్, ఇందిరమ్మ ఇళ్లు, గృహజ్యోతి పథకాలతో రైతులు, మహిళలకు మరింత మేలు
- ధాన్యం సేకరణలో ప్రథమ స్థానంలో నిలిచిన జిల్లా
- ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్‌రెడ్డి

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ప్రజాస్వామ్యబద్ధంగా ప్రజాపాలన చేస్తున్నట్లు, ముఖ్యమంత్రి సలహాదారు (ప్రజావ్యవహారాలు) వేం నరేందర్‌రెడ్డి పేర్కొన్నారు. ప్రజాపాలన ఉత్సవాల్లో భాగంగా బుధవారం నిజామాబాద్ కలెక్టరేట్‌లో ఆయన జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అంతకు ముందు పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. తన ప్రసంగంలో నరేందర్ రెడ్డి జిల్లా ప్రగతి నివేదికను వివరించారు. వివిధ శాఖల ద్వారా అమలవుతున్న కార్యక్రమాలు, సాధించిన ప్రగతిని తెలిపారు. 1948 సెప్టెంబర్ 17న హైదరాబాద్ సంస్థానం రాచరిక వ్యవస్థ నుంచి ప్రజాస్వామ్య వ్యవస్థలోకి వచ్చిందన్నారు. ప్రస్తుతం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం గాంధీజీ కలలుగన్న గ్రామస్వరాజ్యం దిశగా వెళుతూనే, అంతర్జాతీయ పెట్టుబడులు ఆకర్షించడంలో స్వర్గధామంగా



జెండా ఆవిష్కరణ సందర్భంగా గౌరవవందనం చేస్తున్న పోలీసులు

పేరు తెచ్చుకుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కారంలో ముందుందన్నారు. ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామన్నారు. గ్రామస్థాయిలో, పట్టణాల్లో వార్డు స్థాయిలో సదస్సులు నిర్వహించి ప్రజల సమస్యలను నేరుగా పరిష్కరించేందుకు 'ప్రజాపాలన' పేరిట కార్యక్రమం తీసుకొచ్చామన్నారు.

రైతులకు రూ.755.29 కోట్ల రుణమాఫీ

రాష్ట్ర వ్యవసాయ చరిత్రను తిరగరాసి అన్నదాతల సంక్షేమానికి 1.13 లక్షల కోట్లు ఖర్చు చేశామన్నారు. ఇక గత ఏడాది ఆగస్టు 15న రైతు రుణమాఫీకి శ్రీకారం చుట్టామన్నారు. రాష్ట్రంలో



ప్రజాపాలన ఉత్సవాల్లో పాల్గొన్న ఉద్యోగులు

25.35 లక్షల మంది రైతులకు రూ.20,616 కోట్ల రుణమాఫీ చేసి దేశంలో ఏ రాష్ట్ర ప్రభుత్వం చేయని విధంగా చరిత్ర సృష్టించామన్నారు. జిల్లాలో ఇప్పటి వరకు 97,696 మంది రైతులకు 755.29 కోట్ల రుణ మాఫీ అయిందన్నారు. ఇందిరమ్మ రైతు భరోసా కింద ఎకరాకు రూ.12 వేల పెట్టుబడి సాయం ఇస్తున్నామన్నారు. నిజామాబాద్ జిల్లాలో ఈ వానాకాలం సీజనులో ఇప్పటి వరకు 2,72,589 మంది రైతుల బ్యాంకు ఖాతాలలో రూ.316 కోట్లు జమ చేశామన్నారు.

■ కీలక సంస్కరణల్లో ఒకటిగా భూభారతి చట్టం నిలిచిందన్నారు. దీని ద్వారా భూపరిపాలనలో పారదర్శకత, భద్రత, ప్రజలకు సులభమైన సేవలు అందించే దిశగా ముందడుగు



వేశామన్నారు. ఇక ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా ఇంటి స్థలం ఉన్న వారు, ఇల్లు లేని వారు, అద్దె ఇళ్లల్లో నివాసం ఉన్న వారికి అర్హత ప్రకారం ఇళ్లు నిర్మించుకునేందుకు ఆర్థిక సహాయం ఇస్తున్నామన్నారు. తొలివిడతగా ప్రతి నియోజకవర్గంలో 3,500 ఇళ్లు మంజూరు చేశామన్నారు. ఇందుకు రూ.22,500 కోట్లు వెచ్చిస్తున్నామన్నారు. గ్రీన్ ఛానెల్‌లో నిధులు విడుదల చేస్తున్నామన్నారు. జిల్లాలో 19,397 ఇందిరమ్మ ఇళ్లు లక్ష్యం కాగా, 18,155 ఇళ్లు మంజూరు అయ్యాయన్నారు.

ప్రసంగిస్తున్న వేం నరేందర్‌రెడ్డి

❖ గృహ జ్యోతి పథకం ద్వారా మార్చి 2024 నుంచి జూలై 2025 వరకు ప్రతి నెల 2,67,707 మంది వినియోగదారులకు 'జీరో' బిల్లులు మంజూరు చేశామన్నారు. ఇందుకు గాను రూ.174.90 కోట్లు విడుదల చేశామన్నారు.

❖ అమ్మ ఆదర్శ పాఠశాల పథకం కింద 760 పాఠశాలల్లో అత్యవసర మరమ్మతు పనులు చేశామన్నారు. ఇందుకు గాను జిల్లాలో ఇప్పటివరకు రూ.22.20 కోట్లు వెచ్చించామన్నారు. మరోవైపు ధర్పల్లి, ఇందల్వాయి, మెండోర, రుద్రూర్, మోపాల్ మండలాల్లో కేజీబీవీల్లో ఇంటర్ విద్యను ప్రవేశపెట్టామన్నారు.

❖ జిల్లాలో కళ్యాణలక్ష్మి ద్వారా 2025–26లో 1,080 మంది లబ్ధిదారులకు రూ.10.81 కోట్లు అందించామన్నారు. షాదీ ముబారక్ ద్వారా 672 మందికి రూ.6.72 కోట్లు ఇచ్చామన్నారు.

❖ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు సుదర్శన్ రెడ్డి, డాక్టర్ ఆర్ భూపతి రెడ్డి, రాష్ట్ర సహకార యూనియన్ లిమిటెడ్ చైర్మన్ మానాల మోహన్ రెడ్డి, రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, రాష్ట్ర వ్యవసాయ శాఖ కమిషన్ సభ్యుడు గడుగు గంగాధర్, నుడా చైర్మన్ కేశ వేణు, కలెక్టర్ టి వినయ్ కృష్ణారెడ్డి, పోలీస్ కమిషనర్ సాయి చైతన్య, అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్ కుమార్, డీసీసీబీ చైర్మన్ రమేష్ రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి, నిజామాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి, ట్రైనీ కలెక్టర్ కరోలిన్ చింగ్తియాన్ మావీ, నిజామాబాద్ ఆర్డీవో రాజేంద్రకుమార్, నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



బోర్గాం పాఠశాల విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శన





నవీపేట సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల సాంస్కృతిక ప్రదర్శన



సిద్ధార్థ కళాక్షేత్రం ఆధ్వర్యంలో భరతనాట్య ప్రదర్శన

పేదలకు సన్న బియ్యం

'సన్న బియ్యం' పంపిణీ ద్వారా ప్రజలకు మరింత మేలు చేస్తున్నామని, రూ.13 వేల కోట్ల వ్యయంతో 3.10 కోట్ల మందికి సన్నబియ్యం అందిస్తున్నామన్నారు. ఈ ఏడాది జూలై 14 నుంచి కొత్త రేషన్ కార్డుల పంపిణీ ప్రారంభించామన్నారు. మహా లక్ష్మి పథకం ద్వారా రూ.500 లకే సబ్సిడీ గ్యాస్ సిలిండర్లను ఇస్తున్నామన్నారు. జిల్లాలో ఈ పథకం కింద 2,19,330 గ్యాస్ వినియోగదారులకు, 10,19,994 సిలిండర్లకు సబ్సిడీ విడుదలకు రూ.30.73 కోట్లు ఖర్చు చేశామన్నారు.

■ సన్న ధాన్యం రైతులకు క్వింటాలుకు రూ.500 బోనస్ ఇస్తున్నామన్నారు. వ్యవసాయానికి ఉచిత విద్యుత్ కింద 29 లక్షల పంపు సెట్లకు ఉచిత కరెంట్ సరఫరా చేస్తున్నామన్నారు. ఇందుకు గాను రూ.16,691 కోట్ల సబ్సిడీని విద్యుత్ సంస్థలకు చెల్లిస్తున్నామన్నారు. జిల్లాలో 2024–25 వానాకాలం సీజన్‌లో 4,91,497 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని 78,488 మంది రైతుల నుంచి కొనుగోలు చేసి రూ.1,140 కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేశామన్నారు. యాసంగి సీజన్‌లో 8,40,279 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని 1,16,000 రైతుల నుండి ధాన్యం కొనుగోలు చేసి రూ.1,949 కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేశామన్నారు. ధాన్యం కొనుగోళ్లలో ఖరీఫ్, రబీ సీజన్లలో రాష్ట్రంలోనే జిల్లా ప్రథమ స్థానంలో నిలిచిందన్నారు.



బీజేపీ ఎంపీలు రాజీనామా చేయాలి

- యూరియా ఇప్పించలేని కేంద్రమంత్రులు, పార్లమెంట్ సభ్యులు ఎందుకు?
- అర్వింద్‌కు పలుకుబడి ఉంటే యూరియా తెప్పించాలి
- మళ్లీ చెప్పులు, పాస్‌బుక్‌లు లైన్‌లో పెట్టే దౌర్భాగ్యం
- కేసీఆర్ ముందుచూపుతో గతంలో యూరియా కొరత రాలేదు
- మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: రాష్ట్రంలో యూరియా కొరత రోజురోజుకూ తీవ్రమవుతోందని, దీనికి బాధ్యత వహిస్తూ కేంద్రమంత్రులు, బీజేపీ ఎంపీలు వెంటనే రాజీనామా చేయాలని మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి డిమాండ్ చేశారు. రైతాంగానికి సరిపడా యూరియాను తెప్పించలేని బీజేపీ ఎంపీలు ఎందుకని ప్రశ్నించారు. వేల్పూర్‌లో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. నెల రోజుల నుంచి బీఆర్‌ఎస్ తరఫున



వేల్పూర్‌లో మాట్లాడుతున్న ప్రశాంత్‌రెడ్డి

అన్ని వేదికల నుంచి ప్రభుత్వాన్ని హెచ్చరిస్తున్నామన్నారు. మళ్లీ చెప్పులు, పాస్‌బుక్కులు లైన్‌లలో పెట్టే దౌర్భాగ్య పరిస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. యూరియా కోసం రైతులు నిద్రాహారాలు మాని కేంద్రాల వద్ద పడిగాపులు కాస్తుంటే.. అర్వింద్ ఎక్కడికి వెళ్లారని ప్రశ్నించారు. ప్రధాని మోదీ వద్ద పలుకుబడి ఉందని చెప్పుకునే ఆయన.. యూరియా కొరతపై ఎందుకు నోరుమెదపడం లేదన్నారు. వెంటనే ప్రధానితో మాట్లాడి యూరియా తెప్పించాలని డిమాండ్ చేశారు.

ప్రధాని మోదీని నిలదీసే ధైర్యం కాంగ్రెస్ ఎంపీలకు ఎందుకు లేదన్న ప్రశాంత్‌రెడ్డి.. బడే భాయ్‌కు కోపం వస్తుందా? ఆయనకు కోపం వస్తే.. చోటేభాయ్‌కు జైలు శిక్ష పడుతుందా అని ఎద్దేవా చేశారు. ఢిల్లీకి మూటలు పంపడంపై ఉన్న ధ్యాస.. రైతులపై కాంగ్రెస్‌కు లేదని విమర్శించారు.

యూరియా ఎటువెళ్లింది..

జిల్లాకు 75వేల మెట్రిక్ టన్నుల యూరియా అవసరమైతే 72వేల మెట్రిక్ టన్నులు వచ్చినట్లు అధికారులు చెబుతున్నారని, మరి వచ్చిన యూరియా ఎటు వెళ్లిందన్నారు. కాంగ్రెస్ నేతలు బ్లాక్ మార్కెట్‌కు తరలించారా అని ఆరోపించారు. యూరియా సరిపడా సరఫరా చేసే సత్తా లేక.. కాంగ్రెస్, బీజేపీ ఎంపీలకు అవగాహన లేక రైతులు రోడ్డున పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. కేసీఆర్ పాలనలో రైతులు యూరియా కోసం లైన్ కట్టే పరిస్థితి రాలేదని, ముందు చూపుతో వ్యవహరించి సరిపడా తెప్పించారని గుర్తుచేశారు. పోలీస్‌స్టేషన్‌లో టోకెన్లు పంపిణీ చేసే పరిస్థితి ఎప్పుడైనా ఉందా..? అని ప్రశ్నించారు. యూరియా బస్తా ఇవ్వలేని అసమర్థ కాంగ్రెస్, బీజేపీ ఎంపీలు రాజీనామా చేయాలన్నారు. వెంటనే మంత్రులు బృందాన్ని పంపించి యూరియా సరిపడా అందుబాటులో ఉంచాలని ప్రశాంత్‌రెడ్డి డిమాండ్ చేశారు.

ఎస్సారెస్పీలోకి భారీ వరద

- 1.92 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో
- 38 గేట్ల ద్వారా 2.82 లక్షల అవుట్ ఫ్లో

బాల్కొండ: ఎగువ నుంచి శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌లోకి లక్షా 92వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. మంగళవారం సాయంత్రానికి లక్షా 67 వేల క్యూసెక్కులకు తగ్గిన వరద.. బుధవారం ఉదయం 7 గంటల నుంచి క్రమంగా పెరిగింది. ఉదయం 10 గంటలకు 2 లక్షల 15 వేల క్యూసెక్కులకు చేరింది. బుధవారం సాయంత్రం వరకు ఇన్‌ఫ్లో నిలకడగా ఉండగా రాత్రి సమయానికి లక్షా 92వేలకు తగ్గింది. 38 వరద గేట్ల ద్వారా 2 లక్షల 82 వేల క్యూసెక్కుల నీటిని గోదావరిలోకి విడుదల చేస్తున్నారు. వరద కాలువ ద్వారా 6500 క్యూసెక్కులు, కాకతీయ కాలువ ద్వారా 4 వేలు, ఎస్కేప్ గేట్ల ద్వారా 4 వేలు, సరస్వతి కాలువ ద్వారా 400, లక్ష్మి కాలువ ద్వారా 200 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. మిషన్ భగీరథ అవసరాలకు 231 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తుండగా ఆవిరి రూపంలో 701 క్యూసెక్కులు పోతోంది. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటి మట్టం 1091(80.5 టీఎంసీలు) అడుగులు కాగా బుధవారం రాత్రి సమయానికి 1087.06(68.04 టీఎంసీలు) అడుగులు నీరు నిల్వ ఉంది.



గేట్ల ద్వారా గోదావరిలోకి విడుదలవుతున్న నీరు

బైక్ అదుపు తప్పి మామ, కోడలు మృతి

- స్వల్పగాయాలతో బయటపడ్డ మృతురాలి భర్త
- పెళ్లైన 10 నెలలకే విషాదం

మాక్లూర్ /నందిపేట్ (ఆర్మూర్): బైక్ అదుపు తప్పిన ఘటనలో మామ, కోడ లు మృతి చెందారు. ఈ ఘటన మాక్లూర్ మండలం దుర్గానగర్ శివారులో బుధవారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. నందిపేట మండలం తల్వేదకు చెందిన చింటుకు జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలం కొజన్‌కొత్తూర్‌కు చెందిన పూజ(25)తో 10 నెలల క్రితమే వివాహం జరిగింది. బీటెక్ చదివిన పూజ పెళ్లికి ముందు హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేసేది. పెళ్లి సమయంలో ఉద్యోగం మానేసిన ఆమె మళ్లీ ఉద్యోగ ప్రయత్నాల్లో ఉంది. ఇందులో భాగంగానే ఇంటర్వ్యూ కోసమని హైదరాబాద్‌కు వెళ్తుండగా రోడ్డు ప్రమాదం జరిగింది. బైక్‌పై తమను నిజామాబాద్ రైల్వే స్టేషన్ వద్ద వదిలేసి రావాలని తండ్రి నారాయణ (58)ను చింటు కోరాడు. ముగ్గురూ కలిసి బైక్‌పై బయల్దేరారు. చింటు డ్రైవ్ చేస్తుండగా దుర్గానగర్ శివారులో బైక్ అదుపు తప్పి కిందపడిపోయారు. నారాయణ తలకు బలమైన గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. గాయాలపాలైన పూజతోపాటు చింటును అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఉదయం 10 గంటల సమయంలో పూజ మృతి చెందింది. మామ కోడలు మృతితో తల్వేదలో విషాదచాయలు అలుముకున్నాయి. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజశేఖర్ తెలిపారు. ఘటనా స్థలాన్ని ట్రాఫిక్ ఏసీపీ మస్తాన్ అలీ పరిశీలించారు.



నారాయణ (ఫైల్)



పూజ (ఫైల్)

విద్యుత్ షాక్‌తో ఇద్దరు..

- కరెంట్ సాయంతో చేపలు వేటాడే ప్రయత్నం
- కమ్మర్‌పల్లి మండలంలో ఘటన

కమ్మర్‌పల్లి: విద్యుత్ వైర్లను నీటిలో వేసి చేపలను వేటాడాలనుకున్న ఇద్దరు వ్యక్తులు కరెంట్ షాక్‌తో మృతి చెందారు. ఈ ఘటన కమ్మర్‌పల్లి మండల కేంద్రంలో బుధవారం చోటు చేసుకుంది. మండల కేంద్రంలోని గాంధీనగర్‌లో నివాసముంటున్న కొండపల్లి లక్ష్మణ్(39), చిత్తారి నర్సింలు(30) కలిసి నేషనల్ హైవే పక్కన ఉన్న సొటామోటా కాలువ కల్వర్టు వద్ద చేపలను వేటాడేందుకు వెళ్లారు. అయితే విద్యుత్ సహాయంతో చేపలను వేటాడలనుకున్న వారిద్దరు కాలువ వద్ద ఉన్న లో టెన్షన్ లైన్‌కు తీగను తగిలించే క్రమంలో 11 కేవీ లైన్‌కు తగిలి షాక్ గురై అక్కడికక్కడే మృతి చెందారు. బాధిత కుటుంబాల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అనిల్‌రెడ్డి తెలిపారు.



లక్ష్మణ్, నర్సింలు మృతదేహాలు

క్లుప్తంగా

ముగిసిన ఎల్‌ఎల్‌బీ, ఎల్‌ఎల్‌ఎం పరీక్షలు

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో కొనసాగుతున్న ఎల్‌ఎల్‌బీ, ఎల్‌ఎల్‌ఎం సెమిస్టర్‌ రెగ్యులర్‌ పరీక్షలు బుధవారం ముగిసినట్లు అకడమిక్‌ ఆడిట్‌ సెల్‌ డైరెక్టర్‌ ప్రొఫెసర్‌ ఘంటా చంద్రశేఖర్‌ తెలిపారు. వర్సిటీ కళాశాలలో జరిగిన ఎల్‌ఎల్‌బీ, ఎల్‌ఎల్‌ఎం నాలుగో సెమిస్టర్‌ పరీక్షలలో మొత్తం 28 మంది విద్యార్థులకు 28 హాజరైనట్లు పేర్కొన్నారు.

గాయపడిన వ్యక్తిని అంబులెన్స్‌లో తరలించిన సీపీ



డిచ్‌పల్లి: డిచ్‌పల్లి పోలీస్‌స్టేషన్‌ పరిధి నడిపల్లి శివారులోని పెట్రోల్‌ బంక్‌ సమీపంలో బుధవారం ద్విచక్రవాహనంపై వెళుతున్న అశోక్‌ గాబ్రీ అదుపుతప్పి కిందపడగా తలకు బలమైన గాయాలయ్యాయి. అదే సమయంలో డిచ్‌పల్లి ఖిల్లా గ్రామానికి వెళ్తున్న సీపీ పోలీస్‌ కమిషనర్‌ పి.సాయిచైతన్య వెంటనే తన వాహనాన్ని నిలిపివేశారు. 108 అంబులెన్స్‌ను పిలిపించి తీవ్రంగా గాయపడిన అశోక్‌ను వెంటనే చికిత్స నిమిత్తం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. సీపీ వెంట డిచ్‌పల్లి ఎస్సై ఎండీ షరీఫ్‌, సిబ్బంది ఉన్నారు.

జెండా ఎగురవేసిన సీపీ



ఖలీల్‌వాడి: ప్రజాపాలన దినోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రంలోని పోలీస్‌ కార్యాలయంలో సీపీ సాయిచైతన్య బుధవారం జాతీయ జెండా ఎగురవేశారు. కార్యక్రమంలో డీసీపీలు బస్వారెడ్డి, రాంచందర్‌ రావు, సైబర్‌ క్రైమ్‌ ఏసీపీ వై వెంకటేశ్వర్లు, సీసీఎస్‌ ఏసీపీ నాగేంద్రచారి, స్పెషల్‌ బ్రాంచ్‌ సీఐ శ్రీశైలం, సీఐలు, ఆర్‌ఎస్సైలు, ఎస్సైలు తదితరులు పాల్గొన్నారు.

విశ్వేశ్వర శర్మకు డాక్టరేట్‌



తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ ఆంగ్ల విభాగంలో పరిశోధక విద్యార్థి ఏ.విశ్వేశ్వర శర్మ పీహెచ్‌డీ డాక్టరేట్‌ సాధించారు. రిటైర్డ్‌ ప్రొఫెసర్‌ జి.మనోజ పర్యవేక్షణలో 'అప్లికేషన్స్‌ అండ్‌ రేసియల్‌ ఆఫ్‌ నాదిన్‌ గార్డెమర్‌' అనే అంశంపై విశ్వేశ్వర శర్మ పరిశోధన పూర్తి చేసి సిద్ధాంత గ్రంథం సమర్పించారు. బుధవారం తెయూ ఆర్ట్స్‌ అండ్‌ సైన్స్‌ కాలేజ్‌ సెమినార్‌ హాల్‌లో నిర్వహించిన ఓపెన్‌ వైవాకు ఓయూ ప్రొఫెసర్‌ సవిన్‌ ఎక్స్‌టర్నల్‌ ఎగ్జామినర్‌గా వ్యవహరించారు. ఆర్ట్స్‌ డీన్‌ ప్రొఫెసర్‌ లావణ్య, హెచ్‌వోడీ రమణాచారి, బీవోఎస్‌ చైర్మన్‌ సమత, అధ్యాపకులు పాల్గొన్నారు.



జానపద గేయానికి నృత్య ప్రదర్శన ఇస్తున్న కంజర సోషల్‌ వెల్ఫేర్‌ విద్యార్థినులు



జ్ఞాపిక అందుకుంటున్న మానవతా సదన్‌ విద్యార్థులు

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

- ఘనంగా ప్రజాపాలన దినోత్సవం

నిజామాబాద్‌నాగారం: జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌ ఆవరణలో ప్రజాపాలన దినోత్సవాన్ని బుధవారం అట్టహాసంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి హాజరై జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. వేడుకల్లో భాగంగా చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆహుతులను అలరింపజేశాయి. సిద్దార్థ కళాక్షేత్ర, నవీపేట, కంజర సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలలు, బోర్గాం(పి) ప్రభుత్వ పాఠశాల, డిచ్‌పల్లి మానవతా సదన్‌ చిన్నారులు చూడచక్కని నృత్యాలు ప్రదర్శించారు. ఎమ్మెల్యేలు సుదర్శన్‌ రెడ్డి, ఆర్‌.భూపతి రెడ్డి, రాష్ట్ర సహకార యూనియన్‌ లిమిటెడ్‌ చైర్మన్‌ మానాల మోహన్‌ రెడ్డి, రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్‌ తాహెర్‌బిన్‌ హందాన్‌, రాష్ట్ర వ్యవసాయ శాఖ కమిషన్‌ సభ్యుడు గడుగు గంగాధర్‌, నుడా చైర్మన్‌ కేశవేణు, కలెక్టర్‌ వినయ్‌ కృష్ణారెడ్డి, సీపీ సాయి చైతన్య, అదనపు కలెక్టర్లు అంకిత్‌, కిరణ్‌ కుమార్‌, డీసీసీబీ చైర్మన్‌ రమేశ్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌ అంతిరెడ్డి రాజిరెడ్డి, నిజామాబాద్‌ మార్కెట్‌ కమిటీ చైర్మన్‌ ముప్ప గంగారెడ్డి, ట్రెయినీ కలెక్టర్‌ కరోలిన్‌ చింగ్తియాన్‌ మావీ, నిజామాబాద్‌ ఆర్డీవో రాజేంద్రకుమార్‌, నగర పాలక సంస్థ కమిషనర్‌ దిలీప్‌ కుమార్‌ తదితరులు పాల్గొన్నారు.



వేడుకలకు హాజరైన నాయకులు, అధికారులు



ఇందిరా మహిళాశక్తి పాట ఆవిష్కరిస్తున్న నేతలు



సిద్ధార్థ కళాక్షేత్రం విద్యార్థినుల నృత్య ప్రదర్శన

త్వరలో జీవాలకు నట్టల నివారణ మందులు

- ఇండెంట్‌ పంపిన పశుసంవర్ధక శాఖ
- నెలాఖరు నాటికి జిల్లాకు మందుల సరఫరా
- అక్టోబర్‌ మొదటి వారంలో పంపిణీకి ఏర్పాట్లు



మేతకు వెళ్తున్న జీవాలు

డొంకేశ్వర్‌(ఆర్మూర్‌): రెండేళ్ల క్రితం నిలిచిపోయిన జీవాలకు నట్టల నివారణ మందుల పంపిణీ మళ్లీ ప్రారంభం కాబోతుంది. త్వరలో ఈ కార్యక్రమాన్ని మొదలు పెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ఈ మేరకు జిల్లాకు కావాల్సిన మందులు ఎన్నో పశుసంవర్ధక శాఖ అధికారులు రాష్ట్ర శాఖకు ఇండెంట్‌ పంపించారు. ఐదుగురు అధికారులతో కూడిన కమిటీ నాలుగు రకాల మందులను గుర్తించింది. అయితే, ప్రభుత్వం వీటిని ఈ నెలాఖరు నాటికి జిల్లాకు పంపనుంది.

జిల్లాలో 6లక్షలకు పైగా జీవాలు

జిల్లాలో మేకలు, గొర్రెలు కలిపి 6,02,703 ఉన్నాయి. ప్రధానంగా నట్టల వ్యాధితోపాటు బద్దె పురుగులు, కార్యపు జలగలు, బొంత పురుగుల వ్యాధులను సైతం అధికారులు గుర్తించారు. వీటికి కూడా మందులు వేయనున్నారు. గత ప్రభుత్వ హయాంలో నట్టల నివారణ మందులు ఉచితంగా జిల్లాకు వచ్చాయి. ప్రస్తుత ప్రభుత్వంలో ఇప్పటి వరకు మందులు రాలేదు. ఏడాదిలో కనీసం మూడుసార్లు మేకలు, గొర్రెలకు నట్టల నివారణ మందులు వేయాలి. దీంతో జీవాల పెంపకందారులైన గొల్ల, కుర్మలు డబ్బులు వెచ్చించి మందులు కొనుగోలు చేస్తున్నారు. త్వరలో నట్టల నివారణ మందులు ఇస్తామని ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంతో గొల్ల, కుర్మలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ నెలాఖరు నాటికి మందులు జిల్లాకు చేరుకోనుండగా అక్టోబర్‌ మొదటి వారంలో పంపిణీ చేసేందుకు పశుసంవర్ధక శాఖ ప్రణాళిక తయారు చేస్తోంది. తేదీ ఖరారైన వెంటనే గ్రామాల వారీగా షెడ్యూల్‌ను ప్రకటించనున్నారు. అయితే, ప్రజాప్రతినిధుల చేతుల మీదుగా ఈ కార్యక్రమాన్ని ప్రారంభించాలని ప్రభుత్వం భావిస్తున్నట్లుగా తెలుస్తోంది.

నెలాఖరుకు మందులు వస్తాయి

మేకలు, గొర్రెలకు నట్టల నివారణ మందులు పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించిన విషయం వాస్తవమే. నెలాఖరు నాటికి జిల్లాకు పంపుతామన్నారు. వచ్చే నెల మొదటి వారంలో పంపిణీ చేపట్టేందుకు కార్యాచరణ రూపొందిస్తాం.

– రోహిత్‌ రెడ్డి, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి

పెండింగ్‌ బిల్లు చెల్లించాలి

- సీఎం సలహాదారుకు వినతి



ప్రభుత్వ సలహాదారుకు వినతిపత్రం అందిస్తున్న జిల్లా పోలీస్‌ సంఘం ప్రతినిధులు

ఖలీల్‌వాడి: పెండింగ్‌లో ఉన్న బిల్లులను అందించాలని జిల్లా పోలీసుల సంఘం అధ్యక్షుడు షకీల్‌ పాషా కోరారు. జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్‌ భవనంలో ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డిను బుధవారం కలిసిన జిల్లా పోలీసుల సంఘం ప్రతినిధులు వినతిపత్రం అందజేశారు. 2024 జనవరిలో డిపార్ట్‌మెంట్‌కు రావాల్సిన ఎస్‌ఎల్‌ఎస్‌, అడిషనల్‌ ఎస్‌ఎల్‌ఎస్‌–5, జీపీఎఫ్‌, 2018 పీఆర్‌సీ బకాయిలు ఇవ్వాలని పేర్కొన్నారు. రాష్ట్రంలోని అందరు ఉద్యోగులకు పీఆర్సీ అందించారని, పోలీసులకు ఇవ్వలేదని తెలిపారు. ఉద్యోగులు తమ పిల్లలకు అకడమిక్‌ ఇయర్‌ నుంచి ఫీజులు చెల్లించేందుకు ఇబ్బందులు పడుతున్నారని, పెండింగ్‌ బిల్లులు చెల్లించాలని కోరారు.

మొరాయించిన రైల్వే గేటు

బోధన్‌టౌన్‌(బోధన్‌): పట్టణంలోని గాంధీ పార్కు వద్ద ఉన్న రైల్వే గేట్‌ మొరాయించడంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. నిజామాబాద్‌ నుంచి తిరుపతి వెళ్లాల్సిన రాయలసీమ ఎక్స్‌ప్రెస్‌ ఉదయం 11:30 గంటలకు బోధన్‌కు వచ్చి తిరిగి వెళ్లే క్రమంలో రైల్వే గేటు లేవలేదు. దీంతో బోధన్‌ – బాన్సువాడ వెళ్లే వాహనాలు భారీ సంఖ్యలో నిలిచిపోయాయి. మధ్యాహ్నం రైల్వేగేటు మొరాయించడంతో వాహనదారులు ఎండ వేడిమిని తట్టుకోలేక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రైల్వేగేటు వద్ద ఆర్‌వోబీ నిర్మించాలని కోరుతున్నారు.

వీడీసీపై సీపీకి ఫిర్యాదు

మాక్లూర్‌: మండలంలోని అడవి మామిడిపల్లికి చెందిన వీడీసీలోని ఇద్దరు వ్యక్తులపై అదే గ్రామానికి చెందిన దొడ్డిండ్ల బోజేందర్‌ మంగళవారం రాత్రి సీపీ సాయిచైతన్యకు ఫిర్యాదు చేశారు. గ్రామ శివారులోని సర్వే నంబర్‌ 418లో తన తండ్రి దొడ్డిండ్ల భోజన్న పేరుపై ఉన్న 35 గుంటలు భూమిని చదును చేసి పంట భూమిగా మార్చుకునే ప్రయత్నంలో వీడీసీలోని ఇద్దరు వ్యక్తులు అడ్డుపడటమే కాకుండా కులం పేరుతో దూషించి పనులు నిలిపి వేయించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. అయితే, తన భూమి పూర్తిగా గుట్ట ప్రాంతం కావడంతో అందులో ఎలాంటి పంట సాగు చేసుకునే పరిస్థితి లేదన్నారు. ఇందిరమ్మ ఇళ్లకు మొరం కావాల్సి రావటంతో తహసీల్దార్‌ అనుమతుల మేరకు తన 35 గుంటల భూమి నుంచి మొరం తరలిస్తూ సాగు భూమిగా మార్చుకునే ప్రయత్నంలో వీడీసీలోని ఇద్దరు వ్యక్తులు అడ్డుతగిలి పనులు నిలిపి వేశారన్నారు. ఇదిలా ఉండగా బోజేందర్‌ను కులం పేరుతో దూషించలేదని వీడీసీలోని సభ్యుడు గంగోనే సంతోష్‌ తెలిపారు. ఆయన తన భూమిలో నుంచి మొరం అక్రమంగా తరలిస్తున్నాడని తహసీల్దార్‌కు ఫిర్యాదు చేయడాన్ని మనసులో పెట్టుకొని తనపై తప్పుడు కేసు పెట్టేందుకు ప్రయత్నించడం తగదన్నారు.

క్రైం కార్నర్‌

కుక్కల దాడిలో మేకల మృతి



కుక్కల దాడిలో మృతి చెందిన మేక

నందిపేట్‌(ఆర్మూర్‌): నందిపేట మండల కేంద్రంలో కుక్కల దాడిలో రెండు మేకలు మృతి చెందాయి. నందిపేటకు చెందిన ఎస్‌కే. అజీం తన ఇంటి ఎదుట రెండు మేకలను కట్టేసి ఉంచాడు. కాగా, ఒక్కసారి గుంపులుగా వచ్చిన కుక్కలు దాడి చేసి రెండు మేకల గొంతులను పట్టేసాయి. మేకల అరుపులు విని కుక్కలను తరిమివేసే ప్రయత్నం చేసినా కుక్కలు మేకలను విడిచి పెట్టకుండా వాటి తల, మొండెం భాగాలను వేరు చేశాయి.

రేసుకుక్కల దాడిలో 9 గొర్రెలు, ఒక మేక..



రేసు కుక్కల దాడిలో మృతి చెందిన గొర్రెలు

ఎల్లారెడ్డిరూరల్‌: రేసు కుక్కలు గొర్రెల మందపై దాడి చేయడంతో 9 గొర్రెలు, ఒక మేక మృతి చెందినట్లు బాధితుడు రవి తెలిపారు. మండలంలోని తిమ్మారెడ్డి కట్టకింది తండాకు చెందిన రవి గొర్రెల మందపై రేసు కుక్కలు దాడి చేశాయి. ఘటనా స్థలాన్ని బీట్‌ ఆఫీసర్‌ మౌనిక పరిశీలించారు. ప్రభుత్వం నుంచి నష్ట పరిహారం అందేలా చూడాలని బాధితుడు కోరారు.

మెండోరాలో భారీ చోరీ

- ఆరు తులాల బంగారం అపహరణ



వివరాలు సేకరిస్తున్న సీఐ శ్రీధర్‌రెడ్డి, ఎస్సై సుహాసిని

బాల్కొండ: మెండోరా మండల కేంద్రంలోని ఓ ఇంట్లో బుధవారం పట్టపగలు చోరీ జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మేర రామకృష్ణ దంపతులు మెండోరా మండల కేంద్రంలో కిరాణాషాపును నిర్వహిస్తారు. రోజూ ఇంటికి తాళం వేసి వచ్చి షాపులో ఉంటారు. పట్టపగలు గుర్తుతెలియని దుండగులు తాళం పగులగొట్టి లోపలికి ప్రవేశించారు. ఇంట్లో ఉన్న 6 తులాల బంగారం, 10 తులాల వెండి, రూ. 30 వేల నగదు ఎత్తుకెళ్లారు. సాయంత్రం పాఠశాల నుంచి ఇంటికి వచ్చిన కుమారుడు తాళం పగుల గొట్టి ఉండడాన్ని గమనించి తల్లిదండ్రులకు సమాచారం అందించాడు. దీంతో కుటుంబ సభ్యులు ఇంటికి వచ్చి చూసేలోపు భారీ చోరీ జరిగింది. వెంటనే స్థానిక పోలీసులకు సమాచారం అందించారు. ఆర్మూర్‌ రూరల్‌ సీఐ శ్రీధర్‌ రెడ్డి, ఎస్సై సుహాసిని ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

కుక్కల చంపివేత కలకలం

బోధన్‌రూరల్‌: మండలంలోని పెంటాకుర్దు క్యాంప్‌ గ్రామంలో వీధి కుక్కలను మందుపెట్టి చంపిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గ్రామస్తులు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామంలో వీధికుక్కల బెడద ఎక్కువ అవ్వడంతో సుమారు 50 కుక్కలకు మందు పెట్టి హతమార్చారు. ఈ విషయం సోషల్‌ మీడియాలో వైరల్‌ కావడంతో కరీంనగర్‌ చెందిన యానిమల్‌ ఫౌండేషన్‌ ఆఫ్‌ ఇండియా సంస్థ ప్రతినిధి గౌతమ్‌ బోధన్‌ రూరల్‌ పోలీసులకు ఈ నెల 15న ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు కుక్కల కళేబరాలకు పోస్టుమార్టం నిర్వహించి దర్యాప్తు చేపట్టారు.

పోక్సో కేసు నమోదు

బాన్సువాడ రూరల్‌: మండల కేంద్రంలోని పాత అంగడిబజార్‌ సమీపంలోని ఓ హోటల్‌లో పనిచేసే అహ్మద్‌ అనే వ్యక్తిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు బాన్సువాడ సీఐ అశోక్‌ తెలిపారు. నిరుపేద కుటుంబానికి చెందిన ఓ బాలికను వివాహం చేసుకుంటానని మాయమాటలు చెప్పి తీసుకెళ్లాడు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు నిందితుడిని పోలీసులు అదుపులో తీసుకున్నారు. కాగా, సదరు వ్యక్తికి ఇప్పటికే ఇద్దరు భార్యలు ఉన్నట్లు తెలిసింది.

ఇద్దరి రిమాండ్‌

నిజామాబాద్‌ రూరల్‌: ఆల్ప్రాజోలం పట్టివేత కేసులో ఇద్దరిని రిమాండ్‌కు తరలించినట్లు రూరల్‌ ఎస్సై ఆరిఫ్‌ బుధవారం తెలిపారు. మంగళవారం రూరల్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలోని గుండారం గ్రామంలో 600 గ్రాముల ఆల్ప్రాజోలంను నార్కోటిక్స్‌ అధికారులు పట్టుకున్నారు. నిందితులు అశోక్‌, రమేశ్‌గౌడ్‌ను రూరల్‌ పోలీస్‌స్టేషన్‌కు అప్పగించగా, బుధవారం వారిని రిమాండ్‌కు తరలించారు.

రేషన్‌బియ్యం పట్టివేత

మోపాల్‌: మండల కేంద్ర శివారులో అక్రమంగా తరలిస్తున్న 20.70 క్వింటాళ్ల రేషన్‌ బియ్యాన్ని పట్టుకున్నట్లు ఎస్సై జడ్‌సుస్మిత తెలిపారు. ఆమె కథనం ప్రకారం.. మండల కేంద్రంలో బుధవారం వాహనాలు తనిఖీ చేస్తుండగా కాల్పోల్‌ తండాకు చెందిన రూడవత్‌ కృష్ణ (టీఎస్‌ 16యూసీ 1081) టాటా ఇంట్రా గూడ్స్‌ వెహికల్‌లో బియ్యం తరలిస్తున్నారు. వాటిని తనిఖీ చేయగా 20.70 క్వింటాళ్ల రేషన్‌ బియ్యం ఉన్నాయి. వెంటనే బియ్యం, వాహనాన్ని పోలీస్‌స్టేషన్‌కు తరలించి, కృష్ణపై కేసు నమోదు చేశారు. రేషన్‌ బియ్యాన్ని తరలిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని ఎస్సై తెలిపారు.

పోరాటయోధుల చరిత్ర భావితరాలకు తెలపాలి

- అర్బన్‌ ఎమ్మెల్యే ధన్‌పాల్‌ సూర్యనారాయణ



జెండా ఎగురవేసిన ధన్‌పాల్‌, దినేశ్‌ పటేల్‌

సుభాష్‌నగర్‌: నిజాం నవాబు నిరంకుశ పాలనకు ఎదురు తిరిగిన తెలంగాణ పోరాట యోధుల చరిత్రను భావితరాలకు తెలియజేయాల్సిన బాధ్యత అందరిపై ఉందని నిజామాబాద్‌ అర్బన్‌ ఎమ్మెల్యే ధన్‌పాల్‌ సూర్యనారాయణ పేర్కొన్నారు. తెలంగాణ విమోచన దినోత్సవం సందర్భంగా బీజేపీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు దినేశ్‌ కులాచారితో కలిసి ధన్‌పాల్‌ సూర్యనారాయణ త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అర్బన్‌ ఎమ్మెల్యే మాట్లాడుతూ నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా రాంజీ గోండ్‌, దొడ్డి కొమురయ్య, చాకలి ఐలమ్మ, దాశరథి కృష్ణమాచార్యులు, షోయబుల్లా ఖాన్‌ వంటి ఎందరో మహనీయులు ప్రాణాలు అర్పించారని గుర్తుచేశారు. తెలంగాణ బిడ్డల ఆత్మఘోషను గ్రహించిన సర్దార్‌ వల్లభాయ్‌ పటేల్‌ 1948 సెప్టెంబర్‌ 17న నిజాం మెడలు వంచి ఇక్కడి ప్రజలకు విముక్తి కల్పించారన్నారు. నిజాం ఆనవాళ్లను పూర్తిగా చెరిపేసి, నిజామాబాద్‌ పేరును ఇందూరుగా మార్చాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శులు నాగోళ్ల లక్ష్మీనారాయణ, న్యాలం రాజు, ఉపాధ్యక్షులు పాలెపు రాజు, జిల్లా కార్యదర్శి జ్యోతి, మండలాల అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తెలంగాణ చరిత్రను మలుపుతిప్పిన రోజు

- వీసీ ప్రొఫెసర్‌ యాదగిరిరావు



జెండా ఆవిష్కరించి వందనం చేస్తున్న వీసీ యాదగిరిరావు, రిజిస్ట్రార్‌ యాదగిరి

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ చరిత్రను 1948 సెప్టెంబర్‌ 17 మలుపుతిప్పిన రోజని, శతాబ్దాల బానిస సంకెళ్లను తుంచి స్వాతంత్య్రం పొందిన ఉద్విఘ్న సందర్భమని తెలంగాణ యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్‌ యాదగిరిరావు అన్నారు. ప్రజాపాలన దినోత్సవం సందర్భంగా బుధవారం తెయూ పరిపాలనా భవనం వద్ద జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాజరికం పరిసమాప్తమై తెలంగాణ సమాజం నిజాం కబంద హస్తాల నుంచి విమోచన పొందిన రోజన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్‌ ప్రొఫెసర్‌ ఎం.యాదగిరి, వర్సిటీ కళాశాల ప్రిన్సిపల్‌ ప్రవీణ్‌ మామిడాల, అధ్యాపకులు పాత నాగరాజు, శాంతాబాయి, పీఆర్వో పున్నయ్య, టీచింగ్‌ సిబ్బంది పాల్గొన్నారు.

రక్తదానంతో మేలు

- వీసీ ప్రొఫెసర్‌ యాదగిరిరావు



విద్యార్థులకు జ్యూస్‌ అందజేస్తున్న వీసీ యాదగిరిరావు, రిజిస్ట్రార్‌ యాదగిరి

తెయూ(డిచ్‌పల్లి): రక్తదానం చేయడమంటే ప్రాణదానమేనని తెలంగాణ యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్‌ టీ.యాదగిరిరావు అన్నారు. రక్తదాన్‌ అమృత్‌ మహోత్సవ్‌ 2.0 కార్యక్రమంలో భాగంగా బుధవారం తెయూలో ఎన్‌ఎస్‌ఎస్‌ కోఆర్డినేటర్‌ ప్రొఫెసర్‌ కే.రవీందర్‌రెడ్డి ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన వీసీ మాట్లాడుతూ ఆరోగ్యంగా ఉన్న ప్రతి ఒక్కరూ సంవత్సరంలో కనీసం మూడుసార్లు రక్తదానం చేయాలని సూచించారు. దీంతో తలసేమియా వ్యాధితోపాటు అత్యవసర చికిత్సలు అవసరమున్న వారికి ఎంతో మేలు చేసినట్లవుతుందన్నారు. రక్తదాన కార్యక్రమాలతో ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించవచ్చని రిజిస్ట్రార్‌ ప్రొఫెసర్‌ యాదగిరి అన్నారు. వర్సిటీ విద్యార్థులతోపాటు జీజీ కాలేజ్‌, ఎస్‌ఎస్‌ఆర్‌, వాగ్దేవి (నిజామాబాద్‌), ఆర్కే డిగ్రీ కాలేజ్‌ (కామారెడ్డి), తెలంగాణ రెసిడెన్షియల్‌ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్‌ జిల్లా అధ్యక్షుడు బుస్స ఆంజనేయులు, పీఆర్వో పున్నయ్య, ఎన్‌ఎస్‌ఎస్‌ ప్రోగ్రాం అధికారులు స్వప్న, స్రవంతి, అలీమ్‌ఖాన్‌, టీచింగ్‌, నాన్‌ టీచింగ్‌ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పాడి రైతులు జాగ్రత్తలు పాటించాలి

- జిల్లా పశువైద్యాధికారి రోహిత్‌ రెడ్డి



పశువుకు వైద్యం చేస్తున్న డాక్టర్లు

నిజామాబాద్‌ రూరల్‌: పాడి రైతులు పశువుల పట్ల తగు జాగ్రత్తలు పాటించాలని జిల్లా పశు వైద్యాధికారి రోహిత్‌ రెడ్డి అన్నారు. పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో బుధవారం నగరంలోని అర్సపల్లిలో ఉచిత పశు వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో 36 పశువులకు గర్భకోశ, 42 దూడలకు నట్టల నివారణ మందులు, 48 పశువులకు సాధారణ చికిత్సలు, మూడు పశువులకు కృత్రిమ గర్భధారణ చేశారు. కార్యక్రమంలో మండల పశువైద్యాధికారి బాబురావు, జిల్లా పశువైద్య ఆస్పత్రి డాక్టర్‌ హనుమంత్‌ రెడ్డి, అర్సపల్లి సబ్‌సెంటర్‌ రమేశ్‌, వీఎల్‌వో శ్రీనివాస్‌, ఎల్‌ఎస్‌ఏ సిబ్బంది, గోపాల మిత్రలు, ట్రెయినీ డాక్టర్లు పాల్గొన్నారు.

చదువుతోనే భవిష్యత్తు

రిటైర్డ్‌ ఐఏఎస్‌ చక్రపాణి



మాట్లాడుతున్న విశ్రాంత ఐఏఎస్‌ చక్రపాణి

నిజామాబాద్‌ రూరల్‌: చదువుతోనే విద్యార్థుల భవిష్యత్తు ఉందని విద్యావేత్త, విశ్రాంత ఐఏఎస్‌, పూర్వ కలెక్టర్‌ డీ చక్రపాణి పేర్కొన్నారు. నగరంలోని ఖిల్లా ప్రభుత్వ జూనియర్‌ కళాశాల విద్యార్థులకు రామాలయంలో బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. విద్యార్థులు ధారాళంగా ఇంగ్లిష్‌ మాట్లాడడం నేర్చుకోవాలని, ప్రతిరోజు న్యూస్‌ పేపర్‌ చదవాలని సూచించారు. అంతకు ముందు చక్రపాణిని పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు కృపాల్‌సింగ్‌, ప్రిన్సిపాల్‌, అధ్యాపకులు సన్మానించారు. కార్యక్రమంలో వాసవి క్లబ్‌ సీనియర్‌ సిటిజన్‌ వీరేశం, రమణ స్వామి తదితరులు పాల్గొన్నారు.

కామన్‌ స్కూల్‌ విద్యా విధానం కావాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ శ్రీపాల్‌రెడ్డి

నిజామాబాద్‌ సిటీ: విద్యా వ్యవస్థలు అన్నీ ఒకే విధమైన విద్యావిధానం పాటించాలని ఎమ్మెల్సీ శ్రీపాల్‌రెడ్డి పేర్కొన్నారు. జిల్లాకేంద్రంలోని న్యూ అంబేడ్కర్‌ భవన్‌లో పీఆర్‌టీయూ జిల్లా సర్వసభ్య సమావేశం బుధవారం నిర్వహించారు. కార్యక్రమానికి ఎమ్మెల్సీ శ్రీపాల్‌రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ప్రభుత్వ పాఠశాల ల్లో అన్ని కులాలకు చెందిన పేద, నిరుపేద పిల్లలు చదువుతున్నారని, నాణ్యమైన విద్యను అందించాలని తెలిపారు. సీపీఎస్‌ని రద్దు చేసి పాత పెన్షన్‌ విధానాన్ని అమలు చేసేలా ప్రభుత్వాన్ని ఒప్పించే ప్రయత్నం చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు పుల్గం దామోదర్‌ రెడ్డి, భిక్షం గౌడ్‌, శ్రీనివాస్‌ రెడ్డి, గుండు లక్ష్మణ్‌, వంగ మహేందర్‌ రెడ్డి, మోహన్‌ రెడ్డి, కిషన్‌, పెంట జలంధర్‌, వెంకటేశ్వర గౌడ్‌, తుమ్మల లక్ష్మణ్‌, అంకం నరేశ్‌, గంట అశోక్‌, సరిత తదితరులు పాల్గొన్నారు.

నవరాత్రుల్లో నిబంధనలు పాటించాలి

- బలవంతంగా డబ్బులు వసూలు చేయొద్దు
- సీపీ సాయిచైతన్య

ఖలీల్‌వాడి: దుర్గామాత నవరాత్రి విగ్రహ ఏర్పాటు కోసం ప్రజల నుంచి బలవంతంగా డబ్బులను వసూలు చేయొద్దని సీపీ సాయిచైతన్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసే మండపాలతో ఎవరికీ ట్రాఫిక్‌ ఇబ్బంది కలుగకుండా చూడాలన్నారు. మండపాల వద్ద మహిళలు, యువతులపై 'ఈవ్‌ టీజింగ్‌' జరుగకుండా చూసుకోవాలని తెలిపారు. ప్రజలకు అసౌకర్యం కలుగకుండా డీజే, డీజే మిక్సర్స్‌, హై ఫిడిలిటీ సౌండ్‌ సిస్టమ్‌ వాడకంలో జాగ్రత్తలు పాటించాలని తెలిపారు. రాత్రి 10 గంటలకు 'లౌడ్‌ స్పీకర్లు' ఆఫ్‌ చేయాలని, ఈ విషయంలో సుప్రీంకోర్టు నిబంధనలను పాటించాలని లేకుంటే చట్టారీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విగ్రహాలు ఏర్పాటు చేసేవారు సంబంధిత పోలీసులకు సమాచారం ఇవ్వాలని, మండపం వద్ద ఉదయం, రాత్రివేళల్లో కమిటీ మెంబర్లు అందుబాటులో ఉండాలని తెలిపారు. విద్యుత్‌ కనెక్షన్లు, మండపాల ఏర్పాటు సమయంలో జాగ్రత్తలు పాటించాలని సూచించారు. యువకులు కోపతాపాలకు వెళ్లకుండా సంయమనం పాటించేలా చర్యలు తీసుకోవాలని, ఎలాంటి రూమర్స్‌ (పుకార్ల)ను నమ్మొద్దని సీపీ తెలిపారు.